కొలువుల్లో.. సమాజ సేవల్లో..

ఆదర్శంగా నిలుస్తున్న వనితలు

నేడు మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారు. తమదైన ముద్ర వేస్తున్నారు. ఉద్యోగ విధుల్లోనూ..సమాజ సేవలోనూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. –ఆత్మకూరు/కావలి

పోలీస్ యూనిఫామ్‌పై మక్కువతో..



ఆత్మకూరు ఎక్సైజ్ సీఐగా పని చేస్తున్న రామిరెడ్డి వెంకటరమణమ్మ స్వగ్రామం ప్రకాశం జిల్లా నర్సింగోలు. తండ్రి బలరామిరెడ్డి రైతు. తల్లి అంజమ్మ గృహిణి. వెంకటరమణమ్మకు చిన్నప్పటి నుంచే పోలీసు యూనిఫామ్‌పై ఉన్న మక్కువను గమనించిన తండ్రి చదువులో ప్రోత్సహించారు. అయితే ఆమెకు తొలుత పోలీస్ శాఖలో ఉద్యోగం లభించలేదు. ప్రభుత్వ ఉపాధ్యాయినిగా 2000 నుంచి 2016 వరకు పనిచేశారు. ఆ తరువాత 2017లో ఎక్సైజ్ శాఖలో ఎస్సైగా ఉద్యోగం సాధించారు. ఉదయగిరి, పొన్నూరు, తదితర ప్రాంతాల్లో పనిచేసి పదోన్నతి పొందారు. ప్రస్తుతం ఆత్మకూరు ఎక్సైజ్ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లలను నిరుత్సాహపరచకుండా ప్రోత్సహించి చదివిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఆమె చెబుతున్నారు.

విద్యాశాఖ అధికారిణిగా..



ఆత్మకూరులో ఎంఈఓగా పని చేస్తున్న ఎం జ్యోతి స్వగ్రామం బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు. తండ్రి బాలయ్య రైతు. తల్లి రమణమ్మ చిరుఉద్యోగిని. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో జ్యోతి కష్టపడి చదివి ఉపాధ్యాయినిగా కొలువు సాధించారు. అనంతరం హెచ్ఎంగా, ఎంఈఓగా ఉద్యోగోన్నతి పొందారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, తల్లిదండ్రులు ఆడపిల్లలను చదువు, క్రీడల్లో ప్రోత్సహిస్తే రాణిస్తారని ఆమె చెబుతున్నారు.

రైతునేస్తం సుధామయి



కావలి ఉద్యానాధికారిణిగా విధులు నిర్వహిస్తున్న ఎం సుధామయిది ప్రకాశం జిల్లా ఒంగోలు. తండ్రి కృష్ణమోహన్ ఆర్టీసీ ఉద్యోగి. తల్లి రోశమ్మ గృహిణి. ముగ్గురు కుమార్తెలు. చిన్నకుమార్తె అయిన సుధామయి మెడికల్‌లో సీటు రాక ఎంఎస్సీ బయోటెక్నాలజీ చదివి ఉద్యాన శాఖలో కొలువు సాధించారు. నిత్యం పొలాల్లో పర్యటిస్తూ రైతులకు పంటల సాగులో మెలకువలు, సూచనలు అందజేస్తూ విధి నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తున్నారు.



కుట్టు శిక్షణను నేర్పుతున్న మాధవి

కుట్టు శిక్షణతో మహిళలకు ఆసరాగా..

కావలికి చెందిన పొన్నగంటి మాధవి సామాజిక సేవా దృక్పథంతో నిరుపేద యువతులు, మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆమె 2015లో ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభించారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మందికి 90రోజుల పాటు శిక్షణను అందిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు పట్టణానికి 1050 మంది యువతులు, మహిళలకు శిక్షణను అందించారు. ఉచిత శిక్షణ పూర్తి చేసుకున్న 525 మంది నిరుపేద మహిళలకు దాతల సాయంతో కుట్టు మెషీన్లు అందజేసి వారి కుటుంబాలకు ఆసరాగా నిలిచారు. అలాగే కుట్టు శిక్షణానంతరం ప్రతి బ్యాచ్‌లోని సభ్యులకు వస్త్రాలను అందజేసి దుస్తులు కుట్టిచ్చి ప్రభుత్వ పాఠశాలల్లోని పేద బాలికలకు వితరణ చేస్తున్నారు. అలాగే పేద విద్యార్థులకు దుప్పట్ల పంపిణీతో పాటు ఫీజులు చెల్లిస్తున్నారు. పేదలకు నిత్యావసర సరుకులు సైతం అందజేస్తూ మన్ననలు అందుకుంటున్నారు.

ధైర్యంగా ఎదుర్కోవాలి



ఆడపిల్లలు చదువుతో పాటు ఎలాంటి పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొనగలిగేలా ఉండాలి. గతంతో పోలిస్తే పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలి. తల్లిదండ్రులు ఆడ పిల్లలకు చిన్నవయస్సు నుంచే ధైర్యాన్ని కల్పించి చదువులో ప్రోత్సహించాలి.

–డాక్టర్ కేవీ శేషారత్నం, సూపరింటెండెంట్, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి, ఆత్మకూరు

సామాజిక సేవలో...



బాలికల సమస్యలను తెలుసుకుంటున్న లావణ్య, శారద (ఫైల్)

కావలిలోని కలయిక విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఇలీంద్ర లావణ్య, సలహాదారు సీ శారద సామాజిక సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు. కలయిక విజ్ఞాన కేంద్రం సభ్యుల సహకారంతో విద్యార్థులకు, నిరుద్యోగుల ఉపయోగపడేలా గ్రంథాలయాన్ని నిర్వహిస్తున్నారు. బాలికల, మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలపై స్పందిస్తూ అండగా నిలుస్తున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారు. స్వతహాగా జంతుప్రేమికులైన వారు కావలి తీరంలో తాబేళ్ల సంరక్షణకు సైతం కృషి చేస్తున్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

అల్లూరు : పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంపీపీ శశిరేఖ అన్నారు. మండలంలోని అల్లూరు, ఇస్కపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆమె సందర్శించారు. పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సూచనలు చేశారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

కావలి : వివాహిత అదృశ్యంపై కావలి రూరల్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు అందింది. మల్లిక అనే మహిళ భర్తతో మనస్పర్థలు రావడంతో ముసునూరులోని అక్క వద్ద కొద్దిరోజులుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో తన చెల్లెలు కనిపించడం లేదని అక్క పోలీసులకు ఫిర్యాదు చేసింది.

నేడు లోక్‌అదాలత్

ఆత్మకూరు: పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో శనివారం లోక్‌అదాలత్‌ను నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి బీ గాయత్రి తెలిపారు. పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో లోక్‌అదాలత్‌పై పోలీసు అధికారులు, న్యాయవాదులతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. కక్షిదారులు రాజీపడి వస్తే లోక్‌అదాలత్‌లో కేసులను వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులకు అవగాహన కల్పించి లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు.

బీజేపీ మండలాధ్యక్షురాలిగా విజయలక్ష్మి

ఉదయగిరి: స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారి వెంపులూరి భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో మండల కమిటీ ఎన్నికను శుక్రవారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షురాలిగా పాలగుళ్ల విజయలక్ష్మిని ఎన్నుకున్నారు. జిల్లా పార్టీ జనరల్ సెక్రటరీ గడ్డం విజయ కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ రాజేష్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నుడా లేఅవుట్ పరిశీలన

జలదంకి: జమ్మలపాళెంలోని నుడా లేఅవుట్‌ను నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. లేఅవుట్‌లోని సమస్యలను ప్లాట్ల యజమానులు తన దృష్టికి తీసుకురావడంతో పరిశీలించినట్లు ఆయన తెలిపారు. విద్యుత్, రోడ్లు, తదితర సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రానైట్‌తో అందమైన ఆర్చిని నిర్మిస్తామని తెలిపారు. మిగిలి ఉన్న భూములపై అధికారులతో చర్చించి డెవలప్‌మెంట్ చేస్తామన్నారు. జిల్లాలో నుడా తరుపున ఎక్కువ లేఅవుట్లు వేసి చిన్న ఉద్యోగులు, ఎస్సీలకు తక్కువ ధరకు ప్లాట్లు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట నుడా వైస్‌చైర్మన్ సూర్యతేజ, కావలి ఆర్డీఓ వంశీకృష్ణ, కావలి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, జలదంకి తహసీల్దార్ ప్రమీల ఉన్నారు.

పీజీ జనరల్ మెడిసిన్‌లో ఆత్మకూరు విద్యార్థిని సత్తా



ఆత్మకూరు: పట్టణంలోని వెంకట్రావుపల్లికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు పీసీవీ రాఘవరెడ్డి, వైవీ స్వరాజ్యలక్ష్మి దంపతుల కుమార్తె డాక్టర్ పందల విరాజిత పీజీ జనరల్ మెడిసిన్‌లో 76.8 శాతం మార్కులతో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ఆమె కడపలోని రిమ్స్ కళాశాలలో పీజీ చదువుతోంది. పీజీలో ఉత్తమ ప్రతిభకనబర్చడంపై విరాజితను రిమ్స్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, జనరల్ మెడిసిన్ హెడ్ డాక్టర్ యాదవేంద్రరెడ్డి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



ఆత్మకూరులో సీడీపీఓకు సత్కారం



బిట్రగుంట: ఆర్ఎస్సార్‌లో...



వింజమూరు ఎస్‌బీఐలో..



కావలి: జేబీ కళాశాలలో..

కావలి/బిట్రగుంట/ఆత్మకూరు/ఉదయగిరి/సీతారామపురం/ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ ఆత్మకూరు ప్రాజెక్ట్ సీడీపీఓ దీప్తిసునీలత పేర్కొన్నారు. ఆత్మకూరులోని ఐసీడీఎస్ కార్యాలయంలో ముందస్తుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సీడీపీఓ సునీలతను సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. అలాగే ఉదయగిరిలోని కొళ్లవీధి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ షాను ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు. కావలిలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్, ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగం కోఆర్డినేటర్ వీ వసుంధరాదేవి అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందేశాన్ని అందజేశారు. అలాగే కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నెల్లూరు అపోలో ఆస్పత్రికి చెందిన సీనియర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ శ్రావణిరెడ్డి, ఆర్ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ చంద్రజ్యోతి, కోవూరు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ తేజశ్రుతిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. అలాగే వింజమూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో చీఫ్ మేనేజర్ రామకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మహిళా ఉద్యోగులు, ఖాతాదారులకు మహిళ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే సీతారామపురంలోని స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఈఓపీఆర్డీ భార్గవి పాల్గొని మహిళా దినోత్సవం విశిష్టత, మహిళా సాధికారత, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

'వెలిగొండ'ను పూర్తిచేయాలి

ఉదయగిరి: వెలిగొండ ప్రాజెక్ట్ పనులను వెంటనే పూర్తిచేసి ఉదయగిరి మెట్టప్రాంతానికి సాగునీరందించాలని వెలిగొండ సాధన సమితి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఉదయగిరిలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్ట్‌కు రూ.700 కోట్లు అవసరం కాగా, రాష్ట్ర బడ్జెట్‌లో రూ.394 కోట్లు మాత్రమే కేటాయించడం చూస్తే ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందన్నారు. ప్రకాశం, నెల్లూరు మెట్టప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిధులు సాధించాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ సభ్యులు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ

అనుమసముద్రంపేట/కలిగిరి: ఏఎస్‌పేట మండలం గుంపర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు సరస్వతి పూజను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్ఎం పోతులూరయ్య ఆధ్వర్యంలో పాఠశాల ఆఫీస్ సబార్డినేట్ నారాయణమ్మ, ఆయా చిన్నమ్మ, మధ్యాహ్న భోజన నిర్వాహకులు కృష్ణవేణి, పదమ్మను ఘనంగా సన్మానించారు. అలాగే కలిగిరిలోని పవిత్ర ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రిన్సిపల్ మాదాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో సరస్వతి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

అల్లూరు: మండలంలోని ఆదినారాయణపురం శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై కిషోర్‌బాబు శుక్రవారం దాడులు జరిపారు. 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు కోడిపుంజులు, రెండు కార్లు, ఒక బైక్, పది సెల్‌ఫోన్లు, రూ. 62,740 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉచితంగా కుట్టు శిక్షణ

ఉదయగిరి: ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణను అందజేయనున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ శుక్రవారం తెలిపారు. మండలంలోని బీసీలు-22, బలిజ-4, కమ్మ-12, రెడ్డి-16, ఈబీసీ-10, ఆర్యవైశ్య-4, బ్రాహ్మణ-4, క్షత్రియ-1 చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ఓబీఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

గ్రీన్‌అంబాసిడర్లకు సన్మానం

ఆత్మకూరురూరల్: కరటంపాడులోని చెత్త సంపద తయారీ కేంద్రంలో ఏఎస్‌పేట, ఆత్మకూరు ఎంపీడీఓలు ప్రసన్నకుమారి, ఐజాక్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘన వ్యర్థాల సమర్థ నిర్వహణపై గ్రీన్ అంబాసిడర్లకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. డీఎల్‌డీఓ నయీం తాజ్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా గ్రీన్ అంబాసిడర్లను శాలువాలతో సత్కరించారు.

'ఆదర్శ' విద్యార్థికి ఇన్‌స్పైర్ అవార్డు

కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి పేరాబత్తిన యోగీశ్వర్ భారత్ ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి అందజేస్తున్న ఇన్‌స్పైర్ అవార్డు రూ.10వేలు నగదు బహుమతికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా యోగీశ్వర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.